సాక్షి నిర్మల్

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023

ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త!



ఎన్నికల సంఘం నియమావళి అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తుంది. ఉద్యోగులు పార్టీలకు కొమ్ము కాయవద్దని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.

10లో▸



దుమ్ముతో కష్టాలు

11లో▸

భైంసా నుంచి బాసర వరకు కొనసాగుతున్న హైవే పనులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అసంపూర్తిగా పనులతో దుమ్ము లేస్తోంది.

గరిష్టం/కనిష్టం
34.2/23.1

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఎండ వేడి ఎక్కువగా అనిపిస్తుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన మంత్రి



ప్రచార వాహనంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆయన ఇంటివద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రచార రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నిర్మల్ నియోజకవర్గంలో ప్రతీ ఓటర్లను కలిసి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించనున్నారు. ఇందులో నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి, దివ్యారెడ్డి పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా పోలీసులు



అర్జీదారుని సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: సామాన్యులకు అండగా పోలీసులు ఉండాలని, వారితో స్నేహభావంగా మసలుకోవాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసుల సహాయం కావాలనుకునే వారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు కూడా సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు.

దుర్గామాతకు 3 కిలోల వెండి కిరీటం బహూకరణ



అమ్మవారికి అలంకరించిన వెండికిరీటం

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీకి చెందిన గంగపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో కాలనీలో ప్రతిష్ఠించే దుర్గామాత అమ్మవారికి 3 కిలోల వెండి కిరీటాన్ని సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజులు పూజలు అందుకునే దుర్గామాతకు ఈ కిరీటాన్ని సోమవారం అలంకరించారు. నవరాత్రి ఉత్సవాల అనంతరం తిరిగి దీనిని కాలనీలో భద్రపరచనున్నట్లు యువకులు తెలిపారు. ఏటా అమ్మవారికి అలంకరించేందుకు కాలనీలోని భక్తులు, దాతల సహకారంతో దీనిని తయారు చేయించినట్లు వెల్లడించారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కేసీఆర్



నాయకులను ఆహ్వానిస్తున్న బొజ్జు

ఖానాపూర్: ఇంటికో ఉద్యోగం పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ యువతను అన్ని రకాలుగా మోసం చేసి నియంతపాలన సాగిస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ఆరోపించారు. పట్టణంలోని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు యూసుఫ్‌ఖాన్ నివాసంలో పాత ఎల్లాపూర్, గోసంపల్లె, ఒడ్డెవాడతోపాటు మండలంలోని బావాపూర్(ఆర్), పెంబి మండలం అంకెన, రాయాదారి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. పాలకుల వైఫల్యంతో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను సాగనంపితేనే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అనంతరం సుర్జాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట దయానంద్, రమేశ్, గంగనర్సయ్య, మజీద్, జహీర్ హైమద్, శంకర్, జహీర్, రాజునాయక్, సత్యం, అశోక్, సలీంఖాన్ తదితరులు ఉన్నారు.

ఆమెనే నిర్ణేత!



నియోజకవర్గాల వారీగా పెరిగిన ఓటర్లు ఇలా...

2018లో..	ముథోల్	నిర్మల్	ఖానాపూర్
మొత్తం ఓటర్లు	2,16,784	2,16,777	1,87,893
మహిళలు	1,10,705	1,14,177	94,944
పురుషులు	1,06,063	1,02,570	92,923
ఇతరులు	16	30	26
2023లో..			
మొత్తం ఓటర్లు	2,46,030	2,47,495	2,17,665
మహిళలు	1,26,102	1,29,914	1,10,667
పురుషులు	1,19,910	1,17,563	1,06,985
ఇతరులు	18	18	13

మొత్తం: 6,21,454



జిల్లాలో ఓటర్ల వివరాలిలా...

మొత్తం ఓటర్లు	7,11,190
పట్టణ ఓటర్లు	148,488
గ్రామీణ ఓటర్లు	5,62,702
మహిళా ఓటర్లు	3,66,683
పురుషులు	3,44,458
ఇతరులు	49

- జిల్లాలో అధిక సంఖ్యలో మహిళా ఓటర్లు
- వారి చేతిలోనే అభ్యర్థుల భవితవ్యం

భైంసాటౌన్:'మగువా..మగువా.. లోకానికి తెలుసా నీ విలువ' అన్న సినీ గేయాన్ని మగువా..మగువా.. అభ్యర్థికి తెలుసా నీ విలువ అని నిర్మల్ జిల్లాలో పాడుకోవడం అతిశయోక్తి కాదేమోననిపిస్తోంది. ఎందుకంటే జిల్లాలో సగానికిపైగా మహిళా ఓటర్లే ఉన్నారు. పల్లెలు, పట్టణాల్లోనూ పురుషులను వెనక్కు నెట్టి ఓటుహక్కులో ముందున్నారు. అభ్యర్థుల భవిత నారీమణుల చేతిల్లోనే ఉందని చెప్పడంలో సందేహం లేదు. ప్రతీ మగాడి విజయం వెనుక మహిళ ఉంటుందన్నట్లు.. ఎన్నికల్లో ప్రతీ అభ్యర్థి విజయం వెనుక కచ్చితంగా మహిళా ఓటరు ఉంటారు. దీంతో మహిళా ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో రాజకీయపార్టీలు తలమునకలయ్యాయి.

51.55 శాతం మహిళలే...

ఈనెల 4న ప్రకటించిన ఓటరు తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 7,11,190 మంది ఓటర్లు ఉండగా వీరిలో 3,44,458 మంది పురుషులు, 3,66,683 మంది మహిళలు, 49 మంది ఇతరులున్నారు. మొత్తం ఓటర్లలో 51.55శాతం మహిళలే ఉన్నారు. ఇక పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల వారీగా చూసినా మహిళలే ముందంజలో ఉన్నారు. మొత్తం ఓటర్లలో 1,48,488 మంది పట్టణ ఓటర్లు ఉండగా, 5,62,702 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు. అభ్యర్థుల భవిత మహిళలతోపాటు గ్రామీణ ప్రాంతాల ఓటర్ల చేతిలోనే ఉన్నట్లు కనిపిస్తోంది.

నియోజకవర్గాల వారీగా ఇలా...

ఖానాపూర్ నియోజకవర్గంలో 2,17,665 మంది ఓటర్లు ఉండగా, 16,961 మంది పట్టణ ఓటర్లు, 2,00,704 గ్రామీణ ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,06,985 మంది పురుషులు, 1,10,667 మంది మహిళలు, 13 మంది ఇతరులు ఉన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 2,47,495 ఓటర్లు ఉండగా, 85,158 మంది పట్టణ ఓటర్లు, 1,62,337 గ్రామీణ ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,17,563 మంది పురుషులు, 1,29,914 మంది మహిళలు, 18 మంది ఇతరులు. ముథోల్ నియోజకవర్గంలో 2,46,038 మంది ఓటర్లలో, 46,369 మంది పట్టణ ఓటర్లు, 199,661 గ్రామీణ ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,19,910 మంది పురుషులు, 1,26,102 మంది మహిళలు,18 మంది ఇతరులు ఉన్నారు.

ఓటర్లు.. భారీగా పెరిగారు..!

2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి జిల్లాలో ఓటర్లు భారీగా పెరిగారు. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ మూడు నియోజకవర్గాల్లో కలిపి ఇటీవల ప్రకటించిన ఓటరు తుదిజాబితా పరిశీలిస్తే దాదాపు 89వేలకుపైగా నూతన ఓటర్లు నమోదయ్యారు.

ఓటర్లలో చైతన్యం రావాలి...



ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు హక్కు కల్పించింది. ఈ అవకాశాన్ని ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలి. మహిళలు ఓటు వేయడంలో చైతన్యం చూపాలి.

– శ్రీచందన, గృహిణి, భైంసా

సద్వినియోగం చేసుకోవాలి..



ప్రజా సమస్యలు పరిష్కరించే నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది. పోలింగ్ రోజును సెలవురోజుగా భావించకుండా ఓటు వేయాలి. మహిళలు, పురుషులు ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– బృంద బచ్చువార్, గృహిణి, భైంసా

ముగిసిన జోనల్ క్రీడలు



చాంపియన్‌షిప్ ట్రోఫీతో ధర్మారం గురుకుల విద్యార్థులు..

- ఓవరాల్ చాంపియన్ ధర్మారం గురుకులం



నృత్యాలతో అలరించిన క్రీడాకారులు..

సోన్: సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గురుకుల పాఠశాలలో నాలుగు రోజులపాటు నిర్వహించిన జోన్-2 గురుకులాల జోనల్‌స్థాయి క్రీడలు సోమవారం ముగిశాయి. ఇందులో నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల గురుకుల పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ -14, 17, 19 విభాగాల్లో విద్యార్థులకు వేర్వేరుగా క్రీడలు నిర్వహించారు. ఓవరాల్ చాంపియన్‌గా నిజామాబాద్ జిల్లా ధర్మారం సీవోఈ నిలిచింది.

అండర్-14 విభాగంలో..

కబడ్డీలో కడెం ప్రథమ, కంజర ద్వితీయ స్థానం, టెన్నికాయిట్ డబుల్స్‌లో ధర్మారం ప్రథమ, సుద్దపల్లి ద్వితీయస్థానం, చెస్ సింగిల్స్‌లో అర్చన(కడెం) ప్రథమ, రక్షిత(ధర్మారం)ద్వితీయస్థానం సాధించారు. క్యారమ్స్ డబుల్స్‌లో అర్సిని, నందిని(సుద్దపల్లి)ప్రథమ, సింధూ, అద్విత (ధర్మారం) ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు.

అండర్-17 విభాగంలో..

కబడ్డీలో భైంసా ప్రథమ, ధర్మారం ద్వితీయస్థానం సాధించాయి. ఖోఖోలో ధర్మారం ప్రథమ, బోథ్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్‌లో సుద్దపల్లి ప్రథమ, లెఫ్ట్ పోచంపాడ్ ద్వితీయ స్థానం సాధించాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో ధర్మారం ప్రథమ, నవీపేట్ ద్వితీయ స్థానం, టెన్నీ కాయిట్‌లో ధర్మారం ప్రథమ, జామ్ ద్వితీయ స్థానంలో నిలిచాయి.

అండర్-19 విభాగంలో..

కబడ్డీలో ధర్మారం ప్రథమ, లెఫ్ట్ పోచంపాడ్ ద్వితీయ స్థానం సాధించాయి. ఖోఖోలో రైట్ పోచంపాడ్ ప్రథమ, కడెం ద్వితీయ స్థానంలో నిలిచాయి. హ్యాండ్‌బాల్‌లో కంజర ప్రథమ, రైట్ పోచంపాడ్ ద్వితీయ స్థానం సాధించాయి. బాల్ బ్యాడ్మింటన్‌లో నవీపేట్ ప్రథమ, ధర్మారం ద్వితీయ స్థానం, హ్యాండ్‌బాల్‌లో సుద్దపల్లి ప్రథమ, ధర్మారం ద్వితీయ, టెన్నీకాయిట్‌లో ధర్మారం ప్రథమ, రైట్ పోచంపాడ్ ద్వితీయ స్థానం, చెస్‌లో శ్రీనిక(ధర్మారం) ప్రథమ, పద్మ(జగిత్యాల) ద్వితీయ బహుమతి గెలిచారు. క్యారమ్స్ డబుల్స్‌లో లక్ష్మీప్రసన్న, ఇంద్రభవాని(సుద్దపల్లి) ప్రథమ, చందన, వర్ష (బోథ్) ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు.

అథ్లెటిక్స్‌లో..

అదేవిధంగా అండర్-14, 17, 19 విభాగాల్లో 100, 200, 300, 400, 600, 800, 1500 మీటర్స్ పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్ అండర్ -14లో ఆదిలాబాద్ జట్టు ఓవరల్ చాంపియన్‌గా నిలిచింది. అండర్ - 17, 19 విభాగాల్లో ధర్మారం ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. విజేతలకు ఎంపీడీవో మోహన్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా నిర్వహించాం..



లెఫ్ట్ పోచంపాడ్ గురుకులంలో 9వ జోనల్ క్రీడలు విజయవంతంగా నిర్వహించాం. పోటీలు ఉత్కంఠగా సాగాయి. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరుగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

– నీరజ, క్రీడల నిర్వహణ అధికారి

సమష్టిగా క్రీడల నిర్వహణ..



బాసర జోన్ పరిధిలోని గురుకులాల జోనల్ స్థాయి పోటీలను లెఫ్ట్ పోచంపాడు పాఠశాలలో విజయవంతంగా నిర్వహించాం. అధికారులు సమష్టిగా పనిచేయడంతో పోటీలు ప్రశాంతంగా, విజయవంతంగా ముగిశాయి. సహకరించి విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు. – సరస్వతి, లెఫ్ట్ పోచంపాడ్ గురుకులం ప్రిన్సిపాల్

కమలం నుంచి ఎవరో?

- 'ఏలేటి'కే నిర్మల్ టికెట్
- ముథోల్‌లో ముగ్గురు ఆశావహులు
- ఖానాపూర్ ఎవరికి ఇస్తారో..?

నిర్మల్:అసెంబ్లీ ఎన్నికల టికెట్ల ప్రకటనలో అధికార బీఆర్ఎస్ ముందు వరుసలో ఉండగా, కాంగ్రెస్ ఆదివారం తొలి జాబితా ప్రకటించింది. నిర్మల్ అభ్యర్థిగా శ్రీహరిరావును ఖరారు చేసింది. బీజేపీ మాత్రం టికెట్లపై స్పష్టత ఇవ్వడం లేదు. ఎన్నికల షెడ్యూల్ వచ్చి వారం కావస్తున్నా.. అభ్యర్థుల పేర్లు ప్రకటించకపోవడంపై కార్యకర్తల్లోనూ అయోమయం నెలకొంది. నిర్మల్‌లో మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పేరు ఫైనల్ అయినట్లే ఉన్నా.. అధికారికంగా పార్టీ ప్రకటించాల్సి ఉంది. ముథోల్, ఖానాపూర్‌లో మాత్రం ఆశావహుల మధ్య తీవ్రపోటీ నెలకొంది. రెండుచోట్లా ఆశావహుల కంటే వారి అనుచరులు, పార్టీ కార్యకర్తల్లోనే టికెట్ ఎవరికి వస్తుందన్న ఆతృత, ఇంకెప్పుడు ప్రకటిస్తారన్న అసహనం కనిపిస్తోంది.

నిర్మల్‌లో 'ఏలేటి'..

బీజేపీ గెలుస్తామన్న ఆశలు పెట్టుకున్న నియోజకవర్గాల్లో జిల్లాలోని మూడింటికి మూడూ ఉన్నాయి. ప్రధానంగా నిర్మల్‌లో బీజేపీ గెలుస్తుందని ఇటీవల మాస్టర్‌ప్లాన్ దీక్షలో భాగంగా మహేశ్వర్‌రెడ్డికి సంఘీభావం తెలుపడానికి వచ్చిన రాష్ట్ర నాయకులందరూ పేర్కొన్నారు. మరోవైపు నిర్మల్‌లో పార్టీపరంగానూ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి ఎలాంటి ఇబ్బంది లేదు. మిగతా నియోజకవర్గాల్లో ఉన్నట్లు ఇక్కడ టికెట్ కోసం పోటీ లేదు. పార్టీ సీనియర్లు సైతం ఆయనకే మద్దతుగా నిలువడంతో ఇక టికెట్ ఆయనకే ఖాయమని చెప్పొచ్చు. ఈక్రమంలోనే ఆయన ఇప్పటికే జోరుగాప్రచారంచేసుకుంటున్నారు.

ముథోల్‌లో పరేషాన్..

బీజేపీ కీలకంగా భావిస్తున్న ముథోల్ నియోజవర్గంలో టికెట్ ఎవరికి ఇవ్వాలన్న విషయం సంక్లిష్టంగా మారింది. ఇక్కడి నుంచి ముగ్గురు సీనియర్లు టికెట్ ఆశిస్తున్నారు. 2014, 2018 రెండు ఎన్నికల్లోనూ పోటీచేసి, పార్టీని రెండోస్థానంలో నిలిచిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకంటి రమాదేవి మూడోసారీ తనకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. డీసీసీ అధ్యక్ష పదవిని వదులుకున్న సీనియర్‌నేత పవార్ రామారావుపటేల్ ఐదోవిడత ప్రజాసంగ్రామయాత్ర ప్రారంభసభలో బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని, కచ్చితంగా గెలిచి తీరుతామని చెబుతున్నారు. తనవర్గం ద్వారా ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. మరో సీనియర్ నేత భోస్లే మోహన్‌రావు పటేల్ నియోజకవర్గంలో తనకు పట్టుందని, తనకు పార్టీ టికెట్ ఇస్తే కమలం జెండా ఎగరేస్తామంటున్నారు. పార్టీలో తనకున్న పరిచయాలతో టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. హిందుత్వ ప్రభావం ఎక్కువగా ఉండే మహారాష్ట్ర బెల్టు కావడంతో బీజేపీ ముందునుంచీ ముథోల్‌పై నమ్మకంతో ఉంది. కానీ ఇక్కడ ముగ్గురూ పోటాపోటీగా టికెట్ ఆశిస్తుండటం పరేషాన్‌గా మారింది. పార్టీ కార్యకర్తలూ మూడు వర్గాలుగా విడిపోయి, కమలం కోసం ప్రచారం చేస్తున్నారు.

ఖానాపూర్‌లో ఎవరికి..

గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారి ఖానాపూర్ నియోజకవర్గంలో బీజేపీ టికెట్ కోసం పోటాపోటీ కనిపిస్తోంది. 2018ఎన్నికల్లో పోటీ చేసిన సట్ల అశోక్ అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి రేఖానాయక్‌పై కొన్ని రౌండ్లపాటు అధిక్యతను కనబర్చి అందరి దృష్టిని ఆకర్షించారు. అప్పటి నుంచి కొంత బీజేపీకి ఓటుబ్యాంక్ పెరుగుతూ వచ్చింది. ఇదే క్రమంలో మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ చేరడం, పెంబి జెడ్పీటీసీ జానకీబాయి, హరినాయక్ వంటి వాళ్లూ కమలదళంలోకే రావడంతో ఒక్కసారిగా ఖానాపూర్‌పైనా పార్టీలో ఆశలు పెంచాయి. ప్రజాసంగ్రామయాత్ర ద్వారా బండి సంజయ్ ఇక్కడికి రావడం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసింది. ఇక ఇక్కడ ప్రధానంగా రమేశ్‌రాథోడ్, జానకీబాయి, హరినాయక్ టికెట్ ఆశిస్తున్నారు. ఎవరికి వారు తమకు తెలిసిన పార్టీ పెద్దల రూట్‌లో అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్నారు. ముగ్గురూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో అభ్యర్థి ఎంపిక పార్టీకి కొంత ఇబ్బందికరంగా మారింది.

ఎన్నికల్లో నామినేషన్లు వేస్తాం

- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- దుబాయ్ వేదికగా గల్ఫ్ కార్మిక సంఘాల నిర్ణయం



సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు

నిర్మల్ ఖిల్లా:రానున్న శాసనసభ ఎన్నికల్లో గల్ఫ్ సంఘాల ప్రతినిధులు, గల్ఫ్ బాధిత కుటుంబ సభ్యులతో పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్లు వేయించాలని నిర్ణయించినట్లు గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులు కిరణ్ కుమార్, స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. శని, ఆదివారాల్లో దుబాయ్‌లోని షార్జా, అజ్మన్ తదితర ప్రాంతాలలో గల్ఫ్ కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న గల్ఫ్ కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గల్ఫ్‌లో ఉన్న కార్మికులు, తిరిగివచ్చిన వారు, ప్రవాస కుటుంబ సభ్యులు రాజకీయపరంగా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. వీరంతా ఒకేతాటిపైకి రావాలని, కామారెడ్డి లాంటి అసెంబ్లీ నియోజకవర్గంలో భారీగా నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. గల్ఫ్ కార్మిక ప్రభావిత ప్రాంతాలైన సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, జగిత్యాల, బాల్కొండ, నిర్మల్ నియోజకవర్గాలలో కార్మికసంఘాల నాయకులు పోటీ చేయాలనే ప్రతిపాదన చేశారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో గల్ఫ్ కార్మిక కుటుంబ సభ్యులతో భారీసభ నిర్వహించాలన్నారు. గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న ప్రవాసులందరూ వాట్సాప్, ఈఎంవో, ఫేస్‌బుక్, మెసెంజర్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా తమ కుటుంబ సభ్యులను చైతన్యవంతం చేసి గల్ఫ్ సంఘాల అభ్యర్థులకు మద్దతు ప్రకటించేలా చొరవ చూపాలన్నారు. ఎన్నారై పాలసీ, గల్ఫ్ బోర్డు సాధనే తమ ప్రధాన లక్ష్యమని, గల్ఫ్ కార్మిక సంఘాల మధ్యన అభిప్రాయ భేదాలు లేకుండా ఒకే వేదికపై కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు మంద భీంరెడ్డి, గుగ్గిల్ల రవిగౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉండాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్



శిక్షణలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్:మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే ఎన్నికలు సజావుగా నిర్వహించగలమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు, నోడల్ అధికారులు, తహసీల్దార్లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతీ విషయంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తూ ఓటింగ్ మెషీన్‌లోని వివిధ అంశాలపై ప్రతీ అధికారి ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. అభ్యర్థి చేసిన ప్రతీ ఖర్చును లెక్కలో చూపించాలని, దీనికి సంబంధించి సెక్షన్ డి లో స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు. ఆమేరకు రోజువారీ ఖర్చు వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవోలు, ట్రైనీ శిక్షకులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి తప్పక హాజరు కావాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్:ప్రజావాణికి కిందిస్థాయి అధికారులను పంపొద్దని జిల్లాస్థాయి అధికారులే హాజరు కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పష్టం చేశారు. కలెక్టర్ మూడు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగంలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్య త్వరగా పరిష్కారం అవుతుందనే నమ్మకంతో ప్రజలు ఇక్కడికి వస్తారన్నారు. ఆ నమ్మకాన్ని అధికారులు నిలబెట్టుకోవాలని సూచించారు. పరిష్కరించలేని అంశాలు ఉంటే ఫిర్యాదుదారులకు అక్కడే అవగాహన కల్పించాలని సూచించారు.

వచ్చేవారం నుంచి ప్రజావాణి రద్దు...

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

మాణిక్‌రావుఠాక్రేను కలిసిన మాజీ ఎమ్మెల్యే



మాణిక్‌రావుఠాక్రేతో నారాయణ్‌రావుపటేల్

భైంసాటౌన్: ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావుపటేల్ కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రేను హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం కలిశారు. అనంతరం సమావేశమై ముధోల్ నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. సమావేశంలో మధుయాష్కీగౌడ్, ప్రొఫెసర్ కోదండరాం, ఏఐసీసీ సభ్యులు రాజారాం, అఖిలేశ్‌పటేల్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలో బెల్ట్‌షాపై సోమవారం పోలీసులు దా డి చేశారు. రూ.12,960 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై సందీప్ తెలిపారు. గ్రామానికి చెందిన గంగాధర్‌గౌడ్ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులో మద్యం అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారంతో పోలీ సులు సోమవారం మధ్యాహ్నం బెల్ట్ షాపుపై దాడి చేసి మద్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బీర్నందిలో..

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుకున్నామని ఎస్సై లింబాద్రి తెలిపారు. గ్రామంలోని ఓ ఇంట్లో బెల్టుషాపు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేశామన్నారు. రూ.16,170 విలువైన మద్యం లభించినట్లు వెల్లడించారు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న రూ.4,500 విలువచేసే మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈసందర్భంగా ఎస్సై యాసిర్ అరాఫత్ మాట్లాడుతూ ఎన్నిక కోడ్ కారణంగా తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ధ్రువపత్రాలు లేకుండా డబ్బులు, మద్యం తరలిస్తే సీజ్ చేస్తామన్నారు.



ఉద్యోగులూ.. తస్మాత్ జాగ్రత్త!

- రాజకీయ పక్షాలకు కొమ్ముకాయొద్దు
- ప్రచారంలో పాల్గొంటే వేటే..
- ఎన్నికల కమిషన్ పకడ్బందీ ఆదేశాలు

జంగ్ తెలంగాణ

కెరమెరి(ఆసిఫాబాద్): ఎన్నికల సంఘం నియమావళి అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తుంది. ఉద్యోగులు కేవలం తమ విధుల నిర్వహణకు మాత్రమే పరిమితం కావాలని, ఏ రాజకీయ పక్షానికీ కొమ్ము కాయవద్దని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఎన్నికల నియమావళి నిబంధనలపై వివిధ శాఖల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. పార్టీలకు అనుకూలంగా పనిచేసినా.. ప్రచారంలో పాల్గొన్నా వేటు తప్పదు.



ఉద్యోగులకు ఎన్నికల నియమావళి వివరిస్తున్న కెరమెరి ఎంపీడీవో మహేందర్

నిబంధనలు ఇవే..

- ప్రభుత్వ ఉద్యోగులు ఏరాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనవద్దు.
- పలానా పార్టీకి ఓటేయాలని కిందిస్థాయి ఉద్యోగులను నిర్దేశించకూడదు.
- ఓటర్లు ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు.
- రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం నిర్వహించకూడదు.
- సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు చేయకూడదు.
- అధికార, ప్రతిపక్ష పార్టీలకు సమదూరంలో ఉద్యోగులు ఉండాలి.
- ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ప్రచార సమావేశాలు, సభలపై వీడియో సర్వలైన్స్, స్టాటిస్టికల్ సర్వలైన్స్ బృందాలు వీడియో చిత్రీకరిస్తున్నాయి. వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీక్షిస్తాయి. అందులో ఉద్యోగులు పాల్గొన్నట్లు రాజకీయ పార్టీకి చెందిన ప్రతినిధి ఫిర్యాదు చేస్తే ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుంది.
- నిర్ధారణ అయితే సదరు ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడుతుంది.
- సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు, మీడియాలో వచ్చే వార్తలను పరిశీలించేందుకు ప్రత్యేకంగా మీడియా మానిటరింగ్ టీంను ఏర్పాటు చేశారు.
- ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉద్యోగులు పోస్టులు చేస్తే ఎన్నికల సంఘం చర్యలు తీసుకోనుంది.
- ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించిన ఉద్యోగులను మొదట విధుల నుంచి తప్పించి విచారణ చేపడతారు.
- ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే సమావేశాలకు రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానించవద్దు.
- నూతన నిర్మాణాలు, పథకాలు నాయకుల చేత ప్రారంభించకూడదు.
- వారిచ్చే కానుకలు తీసుకోకూడదు. వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగవద్దు.
- నాయకుల వాహనాల్లో ప్రయాణించవద్దు.
- స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ, ఇతర ఆర్థిక కార్యక్రమాల్లో పాల్గొన్న సమయంలో తీర్మాణం కాపీ తప్పనిసరిగా ఉండాలి.

‘గిరి’పుత్రుల్లో చైతన్యం

- 2018 ఎన్నికల్లో గిరిజన గ్రామాల్లో 85శాతం పైనే పోలింగ్



ఇచ్చోడ(బోథ్): 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలోని పలు మారుమూల గిరిజన గ్రామాల్లో 85 శాతంకు పైగా పోలింగ్ నమోదైంది. అంతకుముందు వాటన్నింటినీ సమస్యాత్మక గ్రామాలుగా పోలీసులు, ఎన్నికల అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో అత్యంత మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఆయా గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల అధికారులు, పోలీసులకు కత్తిమీద సాములాగే ఉండేది. గతంలో నక్సల్స్ ప్రభావిత గ్రామాలుగా గుర్తింపబడి ఎన్నికలు బహిష్కరించిన గ్రామాలు సైతం ఇందులో ఉండడం విశేషం. కానీ 2018లో నిర్వహించిన ఎన్నికల్లో అధికశాతం మంది ప్రజలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 85 శాతంకు పైగా పోలింగ్ నమోదు రికార్డు సృష్టించి గత చరిత్రను తుడిచివేశారు.

బోథ్ నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ నమోదైన గ్రామాలు

పీఎస్ నంబర్	గ్రామం	మండలం	పోలింగ్ శాతం
01	గుబిడి	తాంసి	85.0
15	మార్కగూడ	తాంసి	93.03
24	పాలోడి	తాంసి	90.02
34	గిరిగావ్	తాంసి	89.01
35	అంబుగావ్	తాంసి	90.5
36	పల్సి(కె)	తలమడుగు	92.02
59	దెహగావ్	తలమడుగు	88.04
62	నందిగామ	తలమడుగు	93.02
117	సల్యాద	ఇచ్చోడ	95.01
131	ఎల్లమ్మగూడ	ఇచ్చోడ	91.04
207	కుంటల(కె)	నేరడిగొండ	88.02
215	బోరిగామ	నేరడిగొండ	92.06
218	గుత్పల	నేరడిగొండ	88.03
220	లింగాట్ల	నేరడిగొండ	88.01
222	రాజూర	నేరడిగొండ	85.04

ముధోల్‌లో పెరుగుతున్న పోలింగ్ శాతం

- 2018లో 98.7 శాతంగా నమోదు

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరుగుతోంది. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో దాదాపు 70 శాతానికి మించి పోలింగ్ శాతం నమోదు కాగా 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 98.7 శాతంగా నమోదైంది. 2023 ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,46,030 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,19,910 మంది, మహిళలు 1,26,102 మంది, ఇతరులు 18 మంది ఉన్నారు.

ఏడాది	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1978	92,616	65,681	70.9
1983	1,02,536	71,277	69.5
1985	1,10,291	77,404	70.2
1989	1,21,909	96,494	79.2
1994	1,41,112	1,11,081	78.7
1999	1,62,379	1,22,057	75.2
2004	1,67,579	1,28,712	76.8
2009	1,75,877	1,38,102	78.5
2014	2,08,805	1,62,872	78.0
2018	1,86,418	1,81,696	98.7

యువతదే నిర్ణయం..!

- గెలుపోటములను ప్రభావితం చేసేది వారే..

ఇచ్చోడ/బోథ్: ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా 96,668 మంది యువ ఓటర్లు ఉన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసి సత్తా చాటే శక్తి యువత చేతిలోనే ఉంది. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,35,743 మంది ఉండగా యువ ఓటర్లు 54,998 మంది ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,06,690 మంది ఉండగా యువ ఓటర్లు 41,670 మంది ఉన్నారు. దీంతో ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న ప్రధాన పార్టీలు యువతపై దృష్టి పెట్టాయి. అయితే యువత దాదాపు చదువుకున్న వారు ఉండటం, సామాజిక అంశాలు తెలుసుకునే సామర్థ్యం ఉండటంతో ఎటువైపు మొగ్గు చూపుతారోనని రాజకీయ పార్టీల నాయకుల్లో కలవరం నెలకొంది.

యువతకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం

యువతను ప్రోత్సహించేందుకు, ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా ఈసారి ఎన్నికల సంఘం ప్రతీ నియోజకవర్గంలో యువత ఎక్కువగా ఉన్నచోట ప్రత్యేకంగా యూత్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు సైతం యువకులే ఉండేలా ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

బాధ్యతగా ఓటు వినియోగించుకోవాలి

ఎన్నికల్లో యువత బాధ్యతగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలి. బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో యువ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– చాహత్ బాజ్‌పాయ్, బోథ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి

ప్రలోభాలకు లొంగవద్దు



ప్రజాస్వామ్యంలో నచ్చిన వ్యక్తికి ఓటు వేసి ప్రజాప్రతినిధిగా ఎన్నుకునేలా రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు. అందుచేత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకుని రాజ్యాంగ విలువలు కాపాడుతా.

– అశ్విని సూర్యవంశీ, బజార్‌హత్నూర్

ఓటు అమ్ముకోవద్దు



మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనుండడంతో చాలా సంతోషంగా ఉంది. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడంతో పాటు అవినీతికి పాల్పడని వారికే ఓటు వేస్తా. ఓటు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు. ఓటును ఎవరూ అమ్ముకోవద్దు.

– సాయితేజ, బజార్‌హత్నూర్

సమస్యలు పరిష్కరించే వారికే..



ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక నిరుద్యోగులు చాలాకాలంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో యువత సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేస్తా.

– సిద్దవేని అభిగౌడ్, సిరికొండ

సామాజిక మాధ్యమం.. సాటిమనిషికి తోడుగా..



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్, పోలీసు అధికారులు

- ప్రమాదవశాత్తు మృతిచెందిన హోంగార్డు
- చేయూతనందించిన వాట్సాప్ మాధ్యమం..
- సమీకరించిన మొత్తం రూ.5,67,800
- ఎస్పీ చేతులమీదుగా బాధిత కుటుంబానికి అందజేత

నిర్మల్‌ఖిల్లా/నిర్మల్ టౌన్: ‘ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న’ అనే నానుడిని నిజంచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. గణేశ్ నిమజ్జన బందోబస్తులో భాగంగా సెప్టెంబర్ 27న విధుల్లో ఉన్న మాసం కిరణ్(36) అనే హోంగార్డు మంజులాపూర్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందాడు. వారి కుటుంబ నేపథ్యం, పేదరికంలో ఉన్న వారి పరిస్థితిని చూసి చలించిపోయిన ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తనకు వచ్చిన ఆలోచనతో వివిధ మాధ్యమాల్లో వాట్సాప్ గ్రూపులో ఈ విషయాన్ని చేరవేశాడు. వారు చేసిన వాట్సాప్ పోస్టును చదివిన వారంతా తమకు తోచిన సహాయం చేశారు. ఇలా స్వచ్ఛందంగా అందించిన డబ్బులు సుమారు రూ.5,67,800 ఎస్పీ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా మాసం కిరణ్ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు.

హోంగార్డు కుటుంబనేపథ్యం చూసి చలించి..

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సాకెర గ్రామానికి చెందిన మాసం కిరణ్ గత కొన్ని సంవత్సరాలుగా నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. దిగువ మధ్యతరగతికి చెందిన ఇతనికి భార్య, 10 ఏళ్లలోపు కుమారుడు, కుమార్తె ఉన్నారు. నిర్మల్‌లోనే అద్దెగదిలో ఉండేవాడు. ఇటీవల జరిగిన గణేశ్ నిమజ్జన కార్యక్రమాల్లో బందోబస్తులో భాగంగా బైక్‌పై వెళ్తుండగా మంజులాపూర్ సమీపంలో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కిరణ్ అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వారి పరిస్థితిని చూసి చలించి పోయిన ట్రాఫిక్ ఎస్సై రావుల దేవేందర్ కిరణ్ కుటుంబ నేపథ్యాన్ని వాట్సాప్ గ్రూపులో చేరవేగా వందలాదిమంది స్పందించారు. వివిధ సంస్థల ద్వారా రూ.4,78,000, జిల్లాలోని పోలీసుశాఖ రూ.79,300, డాక్టర్లు దేవేందర్‌రెడ్డి, శశికాంత్ రూ.25 వేలు అందించారు. ఈ మొత్తం రూ.5,67,800 ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత నివ్వాలని..



ఇన్నిరోజులు తమతోపాటుగా పోలీసు శాఖలో స్వల్ప వేతనంతో విధులు నిర్వహించిన మాసం కిరణ్ కుటుంబానికి తగిన సహాయం అందించాలని నిర్ణయించిన తక్కువ సమయంలో ఎక్కువ మందికి సమాచారం చేరవ చేసేందుకు వాట్సాప్ ద్వారా అన్ని గ్రూపుల్లో ఫ్రెండ్స్‌కు, తోటి ఉద్యోగులకు ఈ విషయాన్ని చేరవేశాను. చాలామంది స్పందించారు. ఫోన్‌పే ద్వారా అకౌంట్‌కు డబ్బులను చేరవేశారు. కొంత మంది నగదు రూపంలో అందించారు. బాధ్యతగా భావించి సమీకరించిన మొత్తం డబ్బును బాధిత కుటుంబానికి అందించడం సంతృప్తినిచ్చింది.

– రావుల దేవేందర్, ట్రాఫిక్ ఎస్సై, నిర్మల్

కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: అన్నివర్గాలను మోసం చేసిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నిర్మల్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు కోరారు. పట్టణానికిచెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులు మూడరపు గంగాధర్, రంగు రమేష్‌తోపాటు అక్కపూర్, వెంకటాపూర్‌కు చెందిన పలువురు సోమవారం శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులను ఎన్నడో మర్చిపోయాడన్నారు. కేసీఆర్ చుట్టూ ఉన్న వాళ్లంతా తెలంగాణ ఉద్యమ ద్రోహులేనన్నారు. అధికారం కోసం, అవసరమైనప్పుడు మాత్రమే కేసీఆర్ అమరవీరులకు జోహార్లు అంటాడని ఆ తరువాత వాళ్ల ఊసెత్తడని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటేనని, ఈ ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పాలన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఖానాపూర్ నేతలు

డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావును ఖానాపూర్ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఖరారు చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నాయకులు వెడ్మ బొజ్జు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో దంపతులకు జైలు

నిర్మల్‌టౌన్: ఒక్కరి హత్యాయత్నం కేసులో భార్య, భర్తలకు నిర్మల్ న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌వర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కుంటాల సుందర్ తన సొంత పని నిమిత్తం 2022, జూలై 21న నిర్మల్‌కు వచ్చాడు. పాత బస్టాండ్ ఏరియాలో సోన్ మండలం గంజాల్ గ్రామానికి చెందిన దంపతులు జోజేకర్ గజేందర్–రాణి అలియాస్ నర్రా వనిత సుందర్‌ను పరిచయం చేసుకన్నారు. ఏదైనా పని ఇప్పించాలని కోరారు. సుందర్ వారి మాటలు నమ్మి తన ఇంటికి తీసుకెళ్లాడు. వెళ్లిన కాసేపటికే సుందర్ తన భార్యతో చనువుగా మాట్లాడుతున్నాడని గజేందర్ ఖాళీ విస్కీ సీసాతో దాడిచేశాడు. ఈ ఘటనలో తల, శరీరంపై గాయాలయ్యాయి. గజేందర్ భార్య రాణి తన భర్తకు మద్దతుగా సుందర్ రెండు చేతులు పట్టుకుని చంపాలని ప్రోత్సహించింది. సుందర్ అరవగా చుట్టుపక్కల వారు వచ్చారు. దీంతో భార్యాభర్తలు పారిపోయారు. ఈ విషయంపై సుందర్ మిత్రుడు చిట్టి చిన్నయ్య దిల్‌వర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా డు. అప్పటి ఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపర్చగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజు వు చేశారు. దీంతో గజేందర్, రాణి దంపతులకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్‌జడ్జి అజేశ్‌కుమార్ తీర్పు ఇచ్చారు.

అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నవీన్



నవీన్‌యాదవ్

ఖానాపూర్: అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జక్కుల నవీన్ యాదవ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మండలంలోని బీర్నంది మాజీ సర్పంచ్ నవీన్‌యాదవ్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీతోపాటు పలు జిల్లాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కార్యదర్శిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాసరలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



వెండి పాదుకలను ఇస్తున్న నాగేశ్వర్‌రావు కుటుంబీకులు



గోదావరి నదిలో స్నానాలుచేస్తున్న భక్తులు

భైంసా: బాసర అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువజామునుంచే బాసర వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మ తల్లికి పూజలు చేసి అక్కడి సూర్యేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. తర్వాత సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గోదావరి నది వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారికి వెండి పాదుకలు..

బాసర సరస్వతీ అమ్మవారికి యాల్లప్రగడ నాగేశ్వర్‌రావు కుటుంబీకులు వెండి పాదుకలను కానుకగా సమర్పించారు. 13 కిలోల ఇత్తడి పీఠంపై 1,617 గ్రాముల మిశ్రమ వెండితో అమ్మవారి పాదాలు తయారు చేయించారు. రూ.1,95,826 విలువైన అమ్మవారి పాదాలు దేవస్థానానికి విరాళంగా ఇచ్చారు. తన కుమారులు అమ్మవారి అనుగ్రహంతో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారని అమ్మవారి ఆశీర్వాదంతోనే తాము ఈ స్థాయికి వచ్చామని నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆలయ ఈవో విజయరామారావుతోపాటు ప్రధాన అర్చకులకు ఈ పాదుకలను అందించారు.

ట్రిపుల్‌ఐటీలో బతుకమ్మ సంబరాలు

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థినులు ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరి ంచాయి. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిక ప్రతీక బతుక మ్మ అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్, బతుకమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాల్లో వీసీ, మహిళా ఉద్యోగులు